**మున్నుడి**

వైరాగ్యం తారాస్థాయిని చేరినప్పుడు పరమాత్మునికి 'శరణు' అన్నవారి నోటివెంట వచ్చే ఆవేదననే అన్నమయ్య అద్భుతమైన కీర్తన రూపంలో ఆలపిస్తున్నారు. రకరకములైన బంధములలో కట్టివేసి బ్రతికున్నంతకాలమూ నాది, నాది, నావాళ్లు అంటూ ఒకే యావతో ఈ సంసార సాగరంలో కొట్టుమిట్టాడుతూ మనిషి రోజుకి ఒక్క సారన్నా మనస్ఫూర్తిగా "నారాయణా! నన్ను రక్షించు" అనడు. అనలేడు. ఎన్ని చీకాకులు కలిగినా వాటికేవో తాత్కాలిక పరిష్కారాలకోసం చూస్తాడేకాని మధ్యలో వచ్చినవారు మధ్యలోనే పోతారని శాశ్వతుడు శ్రీవేంకటేశ్వరుడు మాత్రమేనని గ్రహించలేడు. అదే స్వామి మాయ...

చం|| వినుతిని జేసె వేదములు విష్ణుడవంచు గిరీంద్రధారి నిన్
వినుము మదీయ ప్రార్థనలు వేదన సల్పెడి కర్మబంధముల్
దునిమి విరాగి జేయుమిక తోయజనాభుడ! వేంకటేశ్వరా!
గొనకొని అన్నమయ్య హరిగొల్చెను అద్భుత కీర్తనంబుతో

**రాగం : హిందోళ**

నిగమ నిగమాంతవర్ణిత మనోహర రూప
నగరాజ ధరుడా శ్రీనారాయణా ||నిగమ||

దీపించు వైరాగ్య దివ్యసౌఖ్యంబియ్య
నోపక కదా నన్ను నొడబరపుచు
పైపైనె సంసార బంధముల కట్టేవు
నా పలుకు చెల్లునా నారాయణా ||నిగమ||

చీకాకు పడిన నాచిత్తశాంతము సేయ
లేకకా నీవు బహులీల నన్ను
కాకు సేసెదవు బహు కర్మముల బడవారు
నా కొలది వారలా నారాయణా ||నిగమ||



Scanned with CamScanner

వివిధ నిర్బంధముల వెడల ద్రోయక నన్ను
భవసాగరముల దడ బడ జేతురా
దివిజేంద్రవంద్య శ్రీతిరువేంకటాధీశ
నవనీతచోర శ్రీనారాయణా ॥నిగమ॥

**భావామృతం**

వేదముల చేతను వేదాంతములచేతను వర్ణించబడిన మనోజ్ఞమైన రూపముగల ఓ శ్రీమన్నారాయణా! గోవర్ధనధారీ! శరణు.

వైరాగ్య భావన నిజమైన పరమసుఖదాయకము. కాని నీవు అది నామనస్సులో వెలుగొందనీయక నన్ను ప్రతి విషయానికి సమ్మతింపజేయుచు అనేక సంసార బంధాల్లో కట్టి పడేస్తావు. పోనీ అవైనా శాశ్వత బంధాలా అంటే కాదు. అన్నీపైపైన బంధాలు. కట్టిపడేసేవే కానీ వేరు కాదు. అలాగని నామాట చెల్లుతుందా అంటే అదీలేదు. నాకీ బంధం బాగుంది ఇట్లాగే ఉంటానంటే ఉండనిస్తావా, అది మధ్యలో పుటుక్కున తెంపేసి మేము "లబోదిబో" అని మొత్తుకొనేట్లు చేస్తావు. నారాయణా! నాకెందుకయ్యా ఈ అనవసరమైన సంసారబంధం?

ఈ బంధాల వ్యధతో నేను చీకాకు పడి మనశ్శాంతిని కోల్పోతాను. అప్పుడు నిన్ను అసలు తలవను. నీలీల నాకేమో అర్థం కాదాయె. ఏవేవో పరిష్కారాల కోసం మానవులు ఏవేవో కర్మలు చేస్తారు. అటువంటివాళ్లు నావంటి వారలా ప్రభూ! నారాయణా (నేను నీ శరణార్థిని కానా?)

నేను దిక్కులేనివాడిని. నీ శరణు జొచ్చినవాడిని. నన్ను వివిధములైన నిర్బంధాలలో పడద్రోసి, దారితెన్నూ లేని ఈ సంసార సాగరంలో తడబడిపోవునట్లు చేసి పరీక్షించుట న్యాయం కాదయ్యా! దేవేంద్రాదులచే సేవించబడి ఆరాధించబడే ఓ తిరుమలాధీశా! వేంకటేశ్వరా! వెన్నదొంగా! శ్రీమన్నారాయణా! శరణు. నామాట నమ్ము. "అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ"



Scanned with CamScanner